క్లుప్తంగా

సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు

ఇల్లెందురూరల్: ప్రధాన రహదారి విస్తరణతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీకి వరంగా భావిస్తున్నామని సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సహకారంతో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. తాజాగా రూ.పది కోట్ల వ్యయంతో రహదారి, విస్తర్ణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందు రావడం పట్ల హర్షణీయమన్నారు. ఆయా పనుల శంకుస్థాపనకు వస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియలకు ఘనంగా స్వాగతం పలికి కృతజ్ఞత తెలుపుకుంటామని వివరించారు.

మున్నూరుకాపు సంఘం ఇన్‌చార్జ్‌గా నరేష్



నరేష్‌ను అభినందిస్తున్న వద్దిరాజు రవిచంద్ర

ఇల్లెందు: మున్నూరుకాపు సంఘం ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పింగళి నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యపటేల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నరేష్ ఎంపిక పట్ల రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మున్నూరుకాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

30న ముగియనున్న గడువు

జూలూరుపాడు: 2023–2024 విద్యాసంవత్సరానికి ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువు ఈనెల 30న ముగియనున్నట్లు జూలూరుపాడు ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గురుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు కూడా ఈనెల 30 అని పేర్కొన్నారు.

అప్‌గ్రేడ్‌పై అంగన్‌వాడీల హర్షం



కేక్ కట్ చేస్తున్న కొల్లు పద్మ

కొత్తగూడెంరూరల్: మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించినందుకు జిల్లా మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, కల్వకుంట్ల కవిత, మంత్రి సత్యవతి రాథోడ్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షురాలు కొల్లుపద్మ కేక్ కట్ చేశారు. లావుడ్యా పూర్ణ, రూప్ల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లబోతున్న రైతు..

- నిలువునా ఎండిపోతున్న పత్తి మొక్కలు
- ఇటీవల వర్షాలకు చీడపీడలు, కలుపు
- ఆందోళనలో రైతులు





ఎండిపోయిన పత్తి మొక్కలు

సుజాతనగర్: కోటి ఆశలతో పత్తి సాగుచేసిన రైతన్నలకు కష్టాలు మొదలయ్యాయి. అధిక వర్షాలు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రెండు నెలల వయసున్న పత్తి మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. ఒకరోజు ఒక మొక్క ఎండినట్లుగా గమనిస్తే మరుసటి రోజు దానిపక్కన మరో మొక్క ఎండిపోతోంది. ఇలా మొత్తం ఎండిపోయేలా ఉందని రైతులు తలలు పట్టుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తమ పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు సూచించాలని పత్తి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సుజాతనగర్ మండల వ్యాప్తంగా 10,785 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. ఇక్కడి నేలలు పత్తి సాగుకు అనుకూలంగా ఉండటం, గత ఏడాది పత్తి పంటకు మంచి ధర లభించడంతో ఈ ఏడాది సుమారు 1000 ఎకరాల మేర అదనంగా సాగుచేశారు. అయితే మద్రితండా గ్రామ సమీపంలోని రైతుల చేలల్లోని పత్తి మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. ఆశించిన స్థాయిలో ఎదిగి ఉన్న మొక్కలు నిలువునా ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రభావం కొంతమంది పత్తి చేలల్లోనే కనిపిస్తుండగా... ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పెట్టుబడి రూ.60 వేలు అయింది



నాలుగు ఎకరాల కౌలు భూమిలో పత్తి సాగుచేశాను. స్థానికంగానే విత్తనాలు కొనుగోలు చేసిన. 15 రోజులుగా పత్తి చేలో మొక్కలు ఎండిపోతున్నాయి. వ్యవసాయాధికారులు సూచించిన మందులు వాడినా ఉపయోగం లేదు. ఇప్పటివరకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టిన.

– మూడు నాగేష్, కోమటిపల్లి

అధికారులు పర్యటించాలి



15 రోజుల క్రితం వరకు పత్తి పంట బాగానే ఉంది. రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశాం. ఏపుగా పెరిగి పూత దశలకు వచ్చింది. కానీ ప్రస్తుతం 30 కుంటల విస్తీర్ణంలోని మొక్కలు చాలా వరకు చచ్చిపోయాయి. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలి.

– భూక్యా రాజేష్ రాథోడ్, కోమటిపల్లి

అధిక వర్షాలే కారణం



అధిక వర్షాలు వచ్చినప్పుడు బ్యాక్టీరియా సోకి పంటలు ఈ విధంగా ఎండిపోతాయి. మచ్చ, ఎండు తెగులు కూడా సోకుతుంది. మద్రితండా గ్రామ సమీపంలోని కొన్ని చేలల్లో ఈ ప్రభావాన్ని గుర్తించాం. సూచించిన సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంటను కాపాడుకోవచ్చు.

– ఆర్.విశ్వతేజ, కొత్తగూడెం, కేవీకే శాస్త్రవేత్త

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



మొక్క నాటుతున్న దృశ్యం

సుజాతనగర్: మానవ మనుగడకు మొక్కలే ప్రధాన ఆధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షురాలు కొచ్చర్ల కమలారాణి అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ నగర్‌లో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లు లేకపోతే మానవ మనుగడ ఉండదన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేల్పుల భాస్కర్, మహిళలు మంద వెంకటమ్మ, అమృత, వెంకటమ్మ, అరుణ, వేల్పుల కృష్ణవేణి, మెర్సీ, ఉమ, రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ అంటున్న వారిని నమ్మొద్దు..

పాల్వంచ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో బీఎస్పీ విజయం సాధిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలో వనమా కాలనీ, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, ప్రభుత్వాస్పత్రి వద్ద, గాంధీనగర్, జగ్గు తండాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కామేశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించని అధికార పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజాసేవ అంటూ వస్తారని అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎండీ రమణి, నాగుల రవికుమార్, కేతిని కుమారి, యర్రంశెట్టి రాజేశ్వరి, మర్గమ్మ, అనిల్, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ పాట మూగబోదు..



సంస్మరణ సభలో కళాకారుల ఆటపాట

టేకులపల్లి: ప్రజల ఆట ఆగిపోదు.. గద్దర్ పాట మూగబోదని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ భూషణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత లక్కినేని సురేందర్, భారత్ బచావో రాష్ట్ర నేత మల్లెల రామనాథం, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నేత సీతారామయ్య, పౌరహక్కుల నేత ఉపేందర్‌రావు పేర్కొన్నారు. టీపీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం టేకులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు (బెల్లి లలిత ప్రాంగణం)లో ప్రజాయుద్ధ నౌక గద్దర్, ప్రముఖ రచయిత, ఉర్దూ పత్రిక సియాసత్ ఎడిటర్, లౌకిక ప్రజాస్వామిక వాది జహీరుద్దీన్ అలీఖాన్‌ల సంస్మరణ సభ జిల్లా కన్వీనర్ మంతెన సంజీవరావు అధ్యక్షతన జరిగింది. తొలుత రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ... గద్దర్ తన పాటతో పీడిత ప్రజల విముక్తికై పోరాట పంథాకు పిలుపునిచ్చాడని గుర్తు చేశారు. ఐదు దశాబ్దాల సాంస్కృతిక అలజడుల సారమే గుమ్మడి విఠల్‌రావు.. గద్దర్‌గా రూపాంతరం చెంది దేశం నలుమూలలా ప్రత్యామ్నాయ పోరాట విత్తనాలు చల్లి.. పోరుని ఎరుపెక్కించిన ప్రజాగళం గద్దర్ భౌతికంగా మాత్రమే దూరం అయ్యారని ఆయన పాటల రూపంలో ప్రజల గుండెల్లో జీవించే ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో రడం శ్రీను, చార్వాక, తేళ్లూరి వెంకటేశ్వర్లు, ఇస్లావత్ లక్ష్మణ్, ఊక్లా, సత్యం, ధర్మన్న, డి.ప్రసాద్, ఎట్టి ప్రశాంత్, కాంపాటి పృథ్వీ, హరిలాల్, ప్రభాకర్, రేపాకుల శ్రీనివాస్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'సిద్ది' విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచ: ఈ నెల 29న పాత ఆర్టీఓ కార్యాలయం రోడ్డులో నిర్వహించనున్న సీపీఐ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు స్మారక విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సిద్ది రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ప్రజా సంఘాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, నాగరాజు, సుధాకర్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, జకీరయ్య, పాషా పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ సేఫ్టీపై అవగాహన



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వైసీఓఏ క్లబ్‌లో ఆదివారం ఎలక్ట్రికల్ సేఫ్టీపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. గనులలో విద్యుత్ పరికరాలపై పనిచేసేటప్పుడు ముందుగా షట్‌డౌన్ చేసుకోవాలని సూచించారు. ఎస్‌ఓపీని పాటించి లాగ్‌అవుట్, ట్యాగ్ అవుట్ సిస్టంలను పాటించాలని చెప్పారు. గనిలో ఐడిల్ కేబుల్‌ను గుర్తించి తొలగించాలన్నారు. ఇలా పద్ధతి ప్రకారం పనిచేస్తే ఎటువంటి ప్రమాదాలు ఉండవని సూచించారు. సమావేశంలో అధికారులు ప్రభాకర్‌రావు, పంజాల శ్రీనివాసరావు, గిరిధర్‌రావు, విజయభాస్కర్, ప్రహ్లాద్, విజయశేఖర్, శివశంకర్, చిన్నయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఇల్లెందు: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం ఇల్లెందులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఖమ్మం రోడ్ విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ రూ.10 కోట్లతో చేపట్టనున్న పనులకు కరెంటాఫీఎస్ వద్ద చేపట్టిన పైలాన్‌ను ప్రారంభించనున్నారు. జేకే బస్‌స్టాప్ వద్ద రూ.కోటితో చేపట్టిన డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేయనున్నారు. రూ.50 లక్షలతో చేపట్టిన లలితా కళామందిర్ రోడ్, రూ.1.60 కోట్లతో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించనున్నారు. రూ.3.75 కోట్లతో చేపట్టిన బస్ డిపో ప్రారంభోత్సవం, డిపోలో ప్లాట్‌ఫాం పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

ఆరోగ్యంగా జీవించడమే రక్షాబంధన్



శివప్రసాద్‌కు మెమెంటో అందజేస్తున్న ఈశ్వరి

కొత్తగూడెంటౌన్: ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడమే నిజమైన రక్షాబంధన్ అని బ్రహ్మకుమారీస్ బ్రాంచి కొత్తగూడెం ఇన్‌చార్జ్ ఈశ్వరి అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణ పరిధి బాబూ క్యాంప్‌లోని బ్రహ్మకుమారీస్ ఓం శాంతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లయన్స్ 320 ఈ జిల్లా గవర్నర్ లయన్ సీహెచ్‌వీ శివప్రసాద్, ఈశ్వరి పాల్గొన్నారు. మాట్లాడుతూ.. రక్షాబంధన్ అంటే కేవలం సోదరీ, సోదరిమణులే కాక మనలోని చెడు గుణాలను బంధనం చేసుకుంటూ, సమాజానికి మెరుగైన సేవలు అందించడమే నిజమైన రక్షాబంధన్ అన్నారు. భవిష్యత్‌లో బ్రహ్మకుమారీస్, లయన్స్ క్లబ్ సంస్థలు కలిసి సమాజసేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌కు రాఖీ కట్టి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో సంగం వెంకట పుల్లయ్య, జేబీ మోహన్, గుత్తల శ్రీనివాస్, దోతి బాబూరావు, నాగలక్ష్మి, శ్రీదేవి, దస్తగిరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించుకోండి



పాపకొల్లు పోలింగ్ స్టేషన్‌లో పరిశీలిస్తున్న మధుసూదన్ నాయక్

జూలూరుపాడు: 26, 27వ తేదీల్లో జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతం అయింది. ఆదివారం మండలంలోని పాపకొల్లు 62, 63, 64 పోలింగ్ స్టేషన్లతోపాటు, భోజ్యాతండా 65 పోలింగ్ స్టేషన్‌ను వైరా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. తహసీల్దార్ శారద మాట్లాడుతూ.. ఈ రెండు రోజుల్లో 103 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం 18 మంది దరఖాస్తు చేసుకోగా, డెత్ సంబంధించినవి 17 వచ్చినట్లు తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఓటు నమోదు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ ఎం.తిరుపతిరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

త్వరలోనే బీజేపీ, బీఆర్ఎస్‌కు గుణపాఠం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: మోసపూరిత హామీలతో మభ్యపెట్టిన బీజేపీ, బీఆర్ఎస్‌కు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెప్పనున్నారని టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, కాంగ్రెస్ నాయకుడు తూము చౌదరి అన్నారు. చుంచుపల్లి మండలంలోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పొంగులేటి చేరిక సందర్భంగా ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు అమిత్‌షా సభకు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా బస్సులు కేటాయించారని తెలిపారు. తద్వారా ఆ రెండు పార్టీల మధ్య అనుబంధం బయటపడిందని చెప్పారు. కాగా, కొత్తగూడెంలో కాంగ్రెస్ సభ సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తొలగించారని... బీజేపీ నాయకులు అమిత్‌షా ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తీసేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాలను గమనిస్తున్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో తాండ్ర నాగబాబు, మారెడ్ల నర్సింహారెడ్డి, కనకరాజు, దుర్గారాశి సతీష్, వనమా రాము, చిమ్మట నాగేశ్వరరావు, మహేష్, వెంకటేష్, కల్లూరు సంపత్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతి



హర్షం వ్యక్తం చేస్తున్న బోయితండా పాలకవర్గం

ఇల్లెందురూరల్: బోయితండా, పూబెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రహదారుల నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. ఆయా గ్రామపంచాయతీల పాలకవర్గాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశాయి. బోయితండా గ్రామపంచాయతీ పరిధిలో తుంటుబాలు తండా నుంచి పోచారంతండా వరకు, పూబెల్లి గ్రామపంచాయతీలో పూబెల్లి గ్రామం నుంచి దండగుండాల గ్రామం వరకు మొత్తం రూ.7 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మూడేళ్ల క్రితం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ శంకుస్థాపన చేశారు. కానీ అటవీశాఖ అభ్యంతరం తెలుపడంతో పనులు నిలిచిపోయాయి. రహదారుల నిర్మాణంలో అటవీశాఖ కోల్పోతున్న 12 ఎకరాలకు బదులుగా ఇల్లెందు పట్టణంలోని గోవింద్‌సెంటర్‌లోని రెవెన్యూ భూమిని అటవీశాఖకు అప్పగించేందుకు ఒప్పందం కుదిరింది. సంబంధిత ఫైల్‌పై కలెక్టర్ ప్రియాంక సంతకం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానికులు ప్రత్యేకంగా సమావేశమై సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, అటవీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ డిక్లరేషన్ పేదలకు మేలు చేస్తుంది..



ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేదలకు మేలు చేసే విధంగా ఉందని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 15, 16, 17 వార్డులలో ఆయన ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ డిక్లరేషన్‌లపై ప్రచారం చేశారు. మాట్లాడుతూ.. దళిత, గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలులోకి తెచ్చిందని గుర్తుచేశారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పేదలకు వరంలా మారిందన్నారు. అదేతరహాలో ప్రస్తుతం దళితులు, గిరిజనుల జీవితాల్లో సమూల మార్పుకు తాజాగా ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 16వ వార్డులో 25 కుటుంబాలు కోరం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు దొడ్డ డానియేలు, జాఫర్, నాగరాజు, భద్రం, మహబూబ్, సాంబమూర్తి, సూర్యం, శ్రీనివాస్, నిర్మల, సుజాత, పద్మ, విజయ, స్వప్న, స్వాతి, శారద పాల్గొన్నారు.

బహిరంగసభకు తరలిన బీజేపీ శ్రేణులు



చుంచుపల్లి: ఖమ్మం వెళ్తున్న నాయకులు



సుజాతనగర్: సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: ఖమ్మం సభకు జిల్లాలోని భాజపా శ్రేణులు ఆదివారం భారీ ఎత్తున తరలివెళ్లాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో నియోజకవర్గానికి 10 వేల చొప్పున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అమిత్ షా సభకు వెళ్లారు. ఇందు కోసం 100 వరకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఉదయం 11 గంటల నుంచే పార్టీ శ్రేణులు బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ఖమ్మం పయనమయ్యాయి. ఆర్టీసీ బస్సులే కాకుండా కొత్తగూడెం నియోజకవర్గంలో మారుముల గ్రామాలకు 100 వరకు టాటామేజిక్ వాహనాలను ఏర్పాటు చేయటంతో కొందరు అందులో సభకు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీ రంగాకిరణ్, ఆకుల నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్ దగ్గరుండి కార్యకర్తలను ఖమ్మం బీజేపీ సభకు తరలివెళ్లేలా చూశారు.

సుజాతనగర్: రైతు గోస–బీజేపీ భరోసా పేరుతో ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభకు మండల వ్యాప్తంగా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు బస్సులు ఆటోల్లో తరలివెళ్లారు. ఈ యాత్రను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీ రంగాకిరణ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. వెళ్లిన వారిలో భూక్యా రాజేష్, ఉబ్బనపల్లి వినిల్, సురేష్, అన్వర్, సైదా, నరసింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రావణమాసం బోనాలు



ఇల్లెందు: బోనంతో వస్తున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు



కొత్తగూడెంటౌన్: గణేష్‌టెంపుల్ ఏరియాలో..



పాల్వంచ: గాంధీనగర్ ముత్యాలమ్మ తల్లి వద్ద..


కొత్తగూడెంటౌన్: ఆదివారం శ్రావణమాస మహోత్సవం సందర్భంగా ప్రజలు శ్రీపోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నృత్యాలు, డప్పు వాయిద్యాలతో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు.

పాల్వంచ: శ్రావణమాస ఆదివారం సందర్భంగా గాంధీనగర్, బొల్లేరుగూడెం, గట్టాయిగూడెంలలో ముత్యాలమ్మ తల్లి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు బోనాలు తెచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు.


సుజాతనగర్: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని నాయకులగూడెం గ్రామంలో బోనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యువతులు, మహిళలు ముత్యాలమ్మ ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. విస్తారంగా వర్షాలు కురవాలని,అంతా ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఇల్లెందు: మహిళలు ఘనంగా శ్రావణమాస బోనాలు సమర్పించి దేవత ఆశీర్వాదం పొందారు. ఆదివారం ముత్యాలమ్మ దేవాలయాలు కిటకిటలాడాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు చెల్లించుకున్నారు. శివసత్తువుల నోట భవిష్యత్‌ను వినేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ముత్యాలమ్మ ఆలయాల వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు.


టేకులపల్లి: వర్షాలు విస్తారంగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ సులానగర్‌లో ఆదివారం యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో కప్పలకు పెళ్లి చేసి, ఊరేగింపు నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు.



సుజాతనగర్: బోనాలతో వస్తున్న మహిళలు



టేకులపల్లి: సులానగర్ గ్రామంలో కప్పలకు పెళ్లి చేసి ఊరేగిస్తున్న స్థానికులు



కొత్తగూడెంటౌన్: బోనంతో వస్తున్న కోనేరు చిన్ని